సాక్షి పెద్దపల్లి

శుక్రవారం, 4, ఆగస్టు, 2023



ఘనంగా పోచమ్మ బోనాలు

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లిలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. భైండ్ల పూజారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీలో కలిశారు. రుణమాఫీ, ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

29.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి

న్యూస్‌రీల్

ఆర్మీ అటాచ్‌మెంట్‌లో ఎన్‌సీసీ కెడెట్ల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్‌సీసీ కెడెట్లు రాష్ట్రస్థాయి ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సంజీవ్ తెలిపారు. హైదరాబాద్ మెహదీపట్నంలో జరిగిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో డ్రిల్, ఫిజికల్ శిక్షణ, పరిశుభ్రత, రీడింగ్, అగ్నివీర్ తదితర ప్రత్యేక శిక్షణ తరగతుల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు.

అవినీతి, అక్రమాలను నిర్మూలించండి



అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిప్రతం ఇస్తున్న సీపీఐ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని పలు విభాగాల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీని సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేష్, ఎఫ్‌బీఎస్ నాయకులు రేణికుంట్ల నరేంద్ర కోరారు. గురువారం గోదావరిఖనిలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని, నూతన షాపింగ్ కాంప్లెక్స్ ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేయాలని కోరారు. గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ వేయాలని కోరారు.

జీజీహెచ్‌లో స్క్రాప్‌కు ముగిసిన వేలం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో గురువారం ఆస్పత్రిలోని స్క్రాప్‌కు అధికారులు వేలం నిర్వహించారు. వేలంలో ఐదుగురు స్క్రాప్ కొనుగోలుదారులు పాల్గొనగా.. ఇందులో రూ.80వేలతో ఒకరు వేలం దక్కించుకున్నారు.

బల్దియా సెక్రటరీగా అలీం బాధ్యతల స్వీకరణ



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ సెక్రటరీగా ఎంఏ అలీం గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పని చేసిన అలీంను గత నెలలో ప్రభుత్వం రామగుండంకు బదిలీ చేసింది. విధుల్లో చేరిన అలీం మేయర్ బంగి అనిల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మున్సిపల్ ఉద్యోగులకు అండగా నిలవాలి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న 569 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు టీఎస్‌జీవోఎస్ రాష్ట్ర నాయకులు అండగా నిలవాలని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మమిల్ల రాజేందర్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మరం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.హుస్సేన్ ముజీబ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్పందించిన టీఎన్‌జీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మమిల్ల రాజేందర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ఇప్పటికే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకపోయామని, దీనిపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. మరోసారి చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు బండారి రవి, రాపోలు శశికుమార్, కొంకటి వెంకటేష్, బొడ కనకయ్య, వావిలాల అశోక్, ఎల్పుల రాయమల్లు, అడేపు శ్రీనివాస్, ఎండీ ఈసబ్, మంద రాములు, సారయ్య, రాజేందర్, రూప, పద్మ, గౌరులక్ష్మి, ముంతాజ్ బేగం, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికలకు కసరత్తు



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్

- ప్రక్రియ వేగవంతం చేసిన యంత్రాంగం
- తుదిదశకు చేరుకున్న అధికారుల బదిలీలు
- ఉద్యోగుల వివరాల సేకరణలో నిమగ్నం

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో జిల్లా యంత్రాంగం ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. దానికి అనుగుణంగా రెండు నెలల్లో షెడ్యూల్, ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా రామగుండంకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, పెద్దపల్లి, మంథనిలకు ఆర్‌డీవోలను రిటర్నింగ్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా తహసీల్దార్లు వ్యవహరించనున్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటింగ్ యంత్రాల మొదటిస్థాయి తనిఖీ పూర్తయింది. ఓటర్ల తుదిజాబితా తయారీలో అధికారులు తలమునకలై ఉండగా, అధికారుల బదిలీల ప్రక్రియ తుదిదశకు చేరింది.

అంశాలతో ఉద్యోగుల వివరాలు సేకరణ

ఇక పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది, ఇతర అధికారులు పీవో, ఏపీవో, సెక్టర్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, యూఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసేందుకు, అభ్యర్థుల ఖర్చు వివరాల నమోదు బృందాలు, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్ల బృందాలు తదితర అవసరాల కోసం, ఎన్నికల ప్రక్రియలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు అధికార యంత్రాంగం జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ వివరాలను సేకరిస్తుంది. అయితే గతంలో మాదిరికాకుండా ఉద్యోగుల నుంచి సమగ్ర సమాచారం తెలుసుకునేలా ప్రత్యేక ఫార్మెట్‌లో తయారు చేసిన 45అంశాలతో కూడిన పత్రాల ద్వారా స్థానికత, వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. దీంతో అన్ని విభాగాల్లో సమాచార సేకరణ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.

అక్టోబరు 4న తుది జాబితా

కొన్ని రోజుల నుంచి ఓటర్ల జాబితా సవరణపై సిబ్బంది దృష్టిసారించారు. కొత్తగా నమోదు, మార్పు, చేర్పులు, తొలగింపు ఇతర వాటిపై వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్‌ఎస్‌ఆర్) 2023 ప్రకారం ఆగస్టు 2న ముసాయిదా జాబితా విడుదల చేయాల్సి ఉంది. అయితే ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో ఎన్నికల కమిషన్ సవరణ షెడ్యూల్‌లో మార్పులు చేసింది. దీనిలో భాగంగా ఆగస్టు 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, అప్పటి నుంచి సెప్టెంబరు 19వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి 28వరకు పరిశీలిస్తారు. అనంతరం సవరించిన ఓటర్ల తుది జాబితాను అక్టోబర్ 4న ప్రకటిస్తారు.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
పెద్దపల్లి	287	2,45,517
రామగుండం	259	2,07,912
మంథని	288	2,24,475



ఓటింగ్‌పై అవగాహన

ఓటింగ్ విధానం, పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని, ఒక్క మొబైల్ వాహనం ఏర్పాటు చేశారు. వీటిలో ఈవీఎంలను ప్రదర్శిస్తూ, వీవీ ప్యాట్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్ పనితీరును వివరిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాకు ఇప్పటికే 1,749 బ్యాలెట్ యూనిట్స్, 1,361 కంట్రోల్ యూనిట్లు, 1,358 వీవీ ప్యాడ్ యూనిట్లు వచ్చాయి. వాటిని గోదాముల్లో భద్రపర్చారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ పార్టీలతో కలెక్టర్ సమావేశమై పోలింగ్ కేంద్రాలపై చర్చించారు.

నులిపురుగును నియంత్రించాలి



విద్యార్థినికి నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఏడాది మొదలు 19 ఏళ్లలోపు వయస్సు గల టీనేజి పిల్లలందరికీ అల్బండజోల్ మాత్రలు వేసి నులిపురుగును నియంత్రించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రంగంపల్లిలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలోని 2,19,500 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లలంతా మాత్రలు తీసుకొని నులిపురుగుల బారి నుంచి రక్షణ పొంది ఎనిమియా తదితర జబ్బులు రాకుండా చూసుకోవాలని సూచించారు. గురువారం వివిధ కారణాలతో మాత్రలు తీసుకోని వారికి ఈనెల 10న అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, రాఘవపూర్ మెడికల్ అధికారిణి లావణ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల రిజర్వేషన్లు ఖరారు

- గౌడలకు 13, ఎస్సీలకు 8దుకాణాలు కేటాయింపు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మద్యం దుకాణాల రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వం మద్యం పాలసీ 2023–25కోసం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మద్యం దుకాణాల రిజర్వేషన్‌ను లాటరీ పద్ధతిన ఖరారు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 77 మద్యం రిటేల్ షాపుల్లో గౌడ కులస్తులకు 15శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో ఎస్టీ నోటిఫైడ్ ప్రాంతాలు లేనందున ఎస్టీలకు కేటాయించలేదని, గౌడలకు 13, ఎస్సీలకు 8 షాపులు కేటాయించామని తెలిపారు.

ఎంపిక చేసిన దుకాణాలివే..

గౌడ కులస్తులకు షాపు నం.40, 64, 67, 21, 52, 20, 22, 70, 63, 66, 8, 12, 49 ఎంపికయ్యాయన్నారు. ఎస్సీలకు షాపు నం. 27, 69, 6, 14, 76, 55, 44, 17లను ఎంపిక చేసినట్లు వివరించారు. మిగిలిన 56 షాపులకు అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జారీ చేసే లైసన్సులు 2023 డిసెంబర్ 1 నుంచి 2025 నవంబర్ 30 వరకు వర్తిస్తాయన్నారు. ప్రతీ షాపునకు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారినాగలెశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

- సీఎం కేసీఆర్‌ను కోరిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



కేసీఆర్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన మంథని నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు పరిహారం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధానంగా వరదల వల్ల నష్టపోయిన వారికి పరిహారం అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూరే ప్రాజెక్టును పూర్తి చేయాలని, నూతనంగా ఏర్పాటైన పలిమెల మండలంలో ప్రజల సౌకర్యార్థం పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, ఏర్పాటు చేయాలని కోరినట్లు పుట్ట మధు తెలిపారు. అంతకు ముందు మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్‌లను కలిసి నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి పనులపై వినతులు అందించారు. పెద్దపల్లి–కాటారం ప్రధాన రహదారి, బీసీ గురుకుల భవనాలకు నిధులు, గ్రామపంచాయతీలకు భవనాలకు నిధుల కోసం వినతి పత్రాలు అందజేశామని తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు ఉద్యోగాలు శాశ్వతం కాదు

ఫెర్టిలైజర్ సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మగారంలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టర్ నియమించుకున్న కాంట్రాక్టు ఉద్యోగాలు శాశ్వతం కాదని గురువారం ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. కర్మగారంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేసే ఉద్యోగాల వద్ద కొందరు నగదు తీసుకొని శాశ్వత ఉద్యోగాలని చెప్పి మోసం చేస్తున్నారని, అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- డీఈవో మాధవి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జూలపల్లి(పెద్దపల్లి): ఉపాధ్యాయులు తొలిమెట్టు శిక్షణను ఉపయోగించుకొని విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాధికారి డి.మాధవి అన్నారు. గురువారం జూలపల్లి మండలం పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణను సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ గతేడాది నుంచే తొలిమెట్టు శిక్షణ కొనసాగిస్తోందని, విద్యార్థుల సామర్థ్యాలు పెంచడంలో ఉపాధ్యాయులే కీలకమని తెలిపారు. డీఈవో వెంట సర్పంచ్ భారతిజ్యోతిబసు, ఎంఈవో కవిత, నోడల్ అధికారి సరస్వతీ, కాంప్లెక్స్ నోడల్ అధికారి లచ్చయ్య, రీసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్, అశోక్‌రాజు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జడ్జీలు

- గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.వెంకటేశ్, ఫస్ట్ అడిషనల్ మున్సిఫ్ కోర్టు జడ్జి దుర్గం గణేశ్

గోదావరిఖనిటౌన్: పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.వెంకటేశ్, ఫస్ట్ అడిషనల్ మున్సిఫ్ కోర్టు జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోదావరిఖని సబ్ డివిజన్ మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పెట్టిన డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ మద్యపానం, టౌన్ న్యూసెన్స్, కరోనా మాఫీ వంటి పలు రకాల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ కేసులు, జైలులో ఉన్న ఖైదీల కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పనిచేసి సత్వర న్యాయంకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గోదావరిఖని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు ఏసీపీ నంది రవీందర్, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, రామగుండం ట్రాఫిక్, గోదావరిఖని, రామగుండం సీఐలు ప్రవీణ్‌కుమార్, సుంకరి రమేష్, ప్రమోద్‌కుమార్, సూరం వేణుగోపాల్, చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సైలు సమ్మయ్య, సౌజన్య, ఉదయ్‌కిరణ్, జీవన్, వెంకటేశ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

అధికార పార్టీలో అసమ్మతి!

- రామగుండం బీఆర్‌ఎస్‌లో అంతర్గత పోరు
- రసవత్తరంగా అధికారపార్టీ రాజకీయం
- పోటాపోటీగా ప్రజల్లోకి నేతలు
- ఈనెల 6న సభ నిర్వహణకు అసమ్మతి నేతల పిలుపు



ప్రచారం చేస్తున్న అసమ్మతి నేతలు



ప్రజా ఆశీర్వాద యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రామగుండంలో అంతర్గత పోరు ఆసక్తిగా సాగుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ విధేయులుగా ఉంటూనే ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు. పార్టీ నాయకుల మధ్య పోరు రోజుకింత తీవ్రమవుతోంది. ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు టికెట్ ఇవ్వొద్దని, మాలో ఎవరికి టికెట్ ఇచ్చినా సమష్టిగా ముందుకు సాగుతామని నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కందుల సంధ్యారాణి, కొంకటి లక్ష్మీనారాయణ, పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డిలు ప్రచారం చేస్తున్నారు. ముందుగా నలుగురు నాయకులు జతకట్టగా.. ఎమ్మెల్యే తనను పట్టించుకోలేదంటూ మరో నాయకుడు వారితో కలిశాడు. ఇలా ఐదుగురు నాయకులు గనులు, కార్మిక వాడలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ టార్గెట్‌గా వీరి ప్రచారం సాగుతోంది. 15 రోజులుగా అన్ని ఏరియాల్లో తిరుగుతూ ప్రచారాన్ని తీవ్రతరం చేశారు.

ప్రజా ఆశీర్వాదయాత్రతో ఎమ్మెల్యే బిజీ

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రజా ఆశీర్వాద యాత్ర నియోజకవర్గంలో కొనసాగుతోంది. అన్ని ఏరియాల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటూ వారి మద్దతు కూడగట్టే ప్రయత్నంలో ఉన్నారు. అధికారిక కార్యక్రమాలతో పాటు ప్రజాఆశీర్వాద యాత్రకు ప్రాధాన్యమిస్తున్నారు.

మంత్రి వద్దకు చేరిన పంచాయితీ

రామగుండం నియోజకవర్గంలో అసమ్మతి నేతల పంచాయితీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ వద్దకు చేరింది. 15రోజుల కిందట నేతలను తనవద్దకు పిలిపించుకుని మాట్లాడారు. ఒకే పార్టీ నుంచి రెండు వర్గాలుగా చీలిపోవడం వల్ల రాబోయే రోజుల్లో పార్టీకి నష్టం కలుగుతుందని సూచించారు. వారందరితో ఫోన్ ద్వారా మంత్రి కేటీఆర్‌తో మాట్లాడించారు. బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకులను రాష్ట్ర రాజధానికి రావాలని సూచించారు. రాజధానికి వెళ్లినప్పటికీ వరదల బీభత్సం మూలంగా కేటీఆర్‌ను కలవకుండానే వెనుదిరిగి వచ్చారు.

6న అసమ్మతినేతల బహిరంగ సభ

రామగుండం ఎమ్మెల్యే వైఫల్యాలను ఎండగట్టేందుకు అసమ్మతి నేతలు మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, కందుల సంధ్యారాణి, ఎల్లయ్య, మనోహర్‌రెడ్డిలు బహిరంగ సభకు శ్రీకారం చుట్టారు. ఈమేరకు గురువారం విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈనెల 6న గోదావరిఖని దుర్గానగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతర్గత పోరు రోజురోజుకు తీవ్రంగా మారడంతో పార్టీ అధిష్ఠానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

పదోన్నతితో మరింత బాధ్యత



అభినందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొందిన 11 మందిని గురువారం అభినందించారు. పోలీసుశాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందన్నారు. పెరిగిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచేలా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పని చేసి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ సమయం దొరికినప్పుడల్లా యోగా, వాకింగ్ రన్నింగ్ చేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అకస్మాత్తుగా కూలిన వ్యవసాయ బావి



ఇందుర్తిలో కూలిపోయిన బావి

ఓదెల: మండలంలోని ఇందుర్తి గ్రామంలో కావటి భాగ్యలక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన గాజులు వేసిన వ్యవసాయ బావి గురువారం అకస్మాత్తుగా కూలిపోయింది. కరెంటు మోటర్లు, స్టార్టర్లు, పైపులు అందులోనే మునిగిపోయాయి. ఈ ఘటనలో రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు కన్నీరు పెట్టుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్లే ఇలా జరిగిందని తెలిపింది. పక్కనే వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు భయాందోళన చెందారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి, తనకు పరిహారం చెల్లించాలని భాగ్యలక్ష్మి కోరింది.

చిన్నరాతుపల్లి క్రాస్‌రోడ్డులో క్షుద్రపూజ



క్షుద్రపూజ ఆనవాళ్లు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని చిన్నరాతుపల్లి క్రాస్‌రోడ్డులో క్షుద్రపూజ ఘటన కలకలం సృష్టించింది. గుర్తు తెలియని వ్యక్తులు చిన్నరాతుపల్లి, మొట్లపల్లి గ్రామాలకు వెళ్లే కూడలిలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉంచి, పందిని కోసి, తల, మొండెం వేరు చేశారు. గురువారం ఉదయం వాహనదారులు, ప్రయాణికులు క్షుద్రపూజ ఆనవాళ్లు చూసి, భయాందోళన చెందారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతి ఆది, బుధవారాల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు అంటున్నారు. మూఢనమ్మకాల నిర్మూలనపై పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

అవయవదానంపై అవగాహన



దోనర్ కార్డు చూపుతున్న కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ అవయదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్జీ–2 ఏరియాలోని ఎంవీటీసీలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి లింగమూరి మాట్లాడుతూ.. మరణానంతరం శరీరం మట్టిలో కలసిపోకుండా పది మందికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా 27 మంది యువ సింగరేణి కార్మికులు అవయవదానానికి ముందుకురాగా డోనర్ కార్డు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో రమేశ్, మేనేజర్ రంగారెడ్డి, సతీశ్, సాంబయ్య, కిశోర్, రాజు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త వేతన ఒప్పందం.. చర్చల్లో జాప్యం

- ముందుకుసాగని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతన చర్చలు
- వాయిదాతో కార్మిక వర్గాల్లో నైరాశ్యం
- కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు



భిక్షాటన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు (ఫైల్)

జ్యోతినగర్: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల కొత్త వేతన ఒప్పంద చర్చలు ముందుకు సాగకపోవడంతో కార్మికులు నైరాశ్యంలో ఉన్నారు. గత ఒప్పంద కాలపరిమితి ముగిసి ఏడాది గడుస్తోంది. అయినా యాజమాన్యం చర్చలను పలుమార్లు వాయిదా వేయడంతో కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గురువారం జరగాల్సిన చర్చలను ఎన్టీపీసీ ఉన్నతాధికారుల సమావేశం ఉన్నందున రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో అసహనానికి గురవుతున్నారు. ఈ నెల 12న హైదరాబాద్ రీజినల్ లేబర్ కమిషనర్(సెంట్రల్) సమక్షంలో చర్చలు జరగాల్సి ఉంది. కానీ ఎన్టీపీసీ యాజమాన్యం ఇంతవరకు అలవెన్సుల పెంపుదలపై స్పష్టత ఇవ్వకపోవడంతో అసలు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ కార్మిక వర్గాల్లో నెలకొంది. యాజమాన్యంతో చర్చలు జరిగి, కొంతమేర ఒప్పందం పూర్తి చేసుకొని, రీజినల్ లేబర్ కమిషనర్ సమక్షంలో పూర్తిగా ఒప్పందం అమలు చేసుకునే ఆనవాయితీ ఉంది.

ఇప్పటికే 30 సార్లు చర్చలు..

కాంట్రాక్టు కార్మికుల అలవెన్సులతోపాటు పలు డిమాండ్లపై నోటీసు ఇచ్చిన క్రమంలో కార్మిక సంఘాల నాయకులతో ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం ఇప్పటికే 30 సార్లు చర్చలు జరిపింది. అయినా ఒప్పందం మాత్రం కుదరలేదు. చర్చలు కార్మికులకు న్యాయం చేసే దిశగా కొనసాగడం లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టువిడవనట్టుగా వ్యవహరిస్తూ చర్చలను ఇంకా జాప్యం చేస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఏడాదిగా వేచిచూస్తున్నందున కొత్త ఒప్పందం పూర్తయితే ఆ మొత్తానికి సంబంధించిన ఏరియర్స్ వస్తాయని భావిస్తున్నారు. చర్చలు ఎప్పుడు పూర్తవుతాయో, అలవెన్సుల పెంపుదల ఎంత వరకు వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంఈవో సంపత్‌రావు



బాబు ఒంటిపై వాతలను చూపిస్తున్న తల్లి

- స్కూల్ యాజమాన్యానికి నోటీస్ జారీ చేసిన ఎంఈవో

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రెండోతరగతి విద్యార్థిని టీచర్ కొట్టిన ఘటనపై ఎంఈవో సంపత్‌రావు విచారణ జరిపారు. స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరుతూ నోటీస్ జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ కుమారుడు శ్రీనిత్ రెండోతరగతి చదువుతున్నాడు. గత నెల 31న పాఠశాలలో ఉపాధ్యాయురాలు రమ్య ఆ బాలుడి వీపు, చేతులపై వాతలు వచ్చేలా కొట్టారంటూ తల్లిదండ్రులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యానికి చెబితే తమతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ మేరకు ఎంఈవో గురువారం పాఠశాలలో విచారణ చేపట్టారు. సంఘటనపై వివరణ కోరుతూ యాజమాన్యానికి నోటీస్ జారీ చేశారు. ఆయన రావడానికి ముందే స్కూల్‌కు చేరుకున్న విద్యార్థి తల్లి కోపంతో టీచర్‌పై చేయి చేసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. తరగతి గదిలోకి ఉపాధ్యాయులు ఎలాంటి కర్రలు తీసుకెళ్లవద్దని, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయవద్దని అన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు అధిక ఫీజులు తీసుకున్నా, బుక్స్ విక్రయించినా, టీసీల పేరిట డబ్బులు వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీఎస్ఎస్ఎఫ్ నాయకుడు వాజీద్, వివిధ పార్టీల నాయకులు నరేష్, శ్రీనివాస్, సంధ్యారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దేవేందర్ పటేల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డులో షార్ట్‌సర్క్యూట్

- రూ.2 లక్షల ఆస్తి నష్టం



రేకుల షెడ్డులో మంటలు

మంథని: మండలంలోని పుట్టపాకలో ఓ రేకుల షెడ్డులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పుట్టపాకకు చెందిన అన్నదమ్ములు ఎండీ.షఫీ, అస్లాం, ఫయాజ్‌లు నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టుకునేందుకు తాత్కాలికంగా ఒక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. అందులోనే నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి వారు నిద్రలో ఉండగా ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు చెలరేగాయి. దీంతో ఆ అన్నదమ్ములు భయంతో బయటకు పరుగులు తీసి, మంథని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సకాలంలో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పివేసినట్లు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, కూలర్, టీవీ, తలుపులు, నిత్యావసర వస్తువులు, దుస్తులు కాలిపోయాయని అన్నారు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, మరో రూ.3 లక్షల ఆస్తిని కాపాడినట్లు పేర్కొన్నారు. ఏఎల్ఎఫ్ ప్రభు, సిబ్బంది రమేశ్, నాగరాజు, రాజయ్య తదితరులున్నారు.



బాగా తినాలి.. చదవాలి

పిల్లలూ.. భోజనం సరిగా పెడుతున్నారా? కూరలు మంచిగా ఉంటున్నాయా? బాగా తినాలి.. చదవాలి అంటూ విద్యార్థులకు ఆరోగ్యం, చదువు గొప్పతనాన్ని తెలియజేశారు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వర్షం పడితే స్కూల్ భవనం ఉరుస్తుందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సార్లు చెప్పింది సరిగా అర్థమవుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి, మంచి స్థాయికి రావాలని సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఎడ్ల కొట్లాట.. ప్రజల తంటా



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ లోని నర్రాశాలపల్లెలో గురువారం సాయంత్రం రెండు ఎడ్లు కొట్లాడుకున్నాయి. ఇళ్ల ఎదుటకు పరిగెత్తుకు రావడంతో ప్రజలు భయపడ్డారు. అరగంటపాటు ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాలేదు. ఆ తర్వాత అవి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కొత్తూరులో ఆలయానికి టీటీడీ నిధులు



టీటీడీ అధికారితో ఆలయ కమిటీ సభ్యులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామంలో స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు టీటీడీ కార్యాలయ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ రామనాథం గురువారం గ్రామానికి వచ్చారు. ఆలయం నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిధులకు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండవరం శ్రీకాంత్, సభ్యులు సత్యనారాయణ, తోట కొమురయ్య, లింగమూర్తి, రాజేశంనాయక్, మేడిపల్లి లక్ష్మణ్, రమేశ్, దేవసాని రాజయ్య, కట్ట కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు కల్పించండి



వినతి పత్రం ఇస్తున్న సతీశ్

గోదావరిఖని టౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సతీశ్ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో గురుకులాల సెక్రటరీ నవీన్ నికోలస్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతోపాటు పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి, హాస్టళ్లకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతోపాటు తానే స్వయంగా హాస్టళ్లను సందర్శించి, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గిరిజనులకు రాష్ట్రవ్యాప్తంగా వైన్స్ రిజర్వేషన్ వర్తింపజేయాలి

రామగుండం: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు, ఏజెన్సీ ప్రాంతాల జిల్లాల వారికి మాత్రమే వైన్స్ టెండర్లలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సరికాదని జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు భూక్య సాయిరాంనాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ విభాగం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జీవో నం.33 ప్రకారం మైదాన ప్రాంతాల్లోని నిరుద్యోగ గిరిజనుల కు వైన్స్ టెండర్లలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, గిరిజనులకు రాష్ట్రవ్యాప్తంగా రిజర్వేషన్ వర్తింపజేయాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్లకు చెందిన ఎలిగేటి సంపత్ కుమారుడు మహేశ్(14) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్ రామగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు అతన్ని హాస్టల్‌లో ఉంచి, చదివించాలని అనుకున్నారు. మహేశ్ హాస్టల్‌కు వెళ్లేందుకు నిరాకరించడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురై, గత నెల 18న క్రిమిసంహారక మందు తాగాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

బొగ్గు రవాణా వేగవంతం చేయాలి



వీసీలో పాల్గొన్న జీఎం శ్రీనివాస్, అధికారులు

- సింగరేణి డైరెక్టర్ల ఆదేశం
- సీహెచ్‌పీల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్

గోదావరిఖని: వినియోగదారులకు సకాలంలో అందేలా బొగ్గు రవాణా వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. సీహెచ్‌పీల పనితీరుపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగరేణిలోని ఏరియాల వారీగా సీహెచ్‌పీల నుంచి బొగ్గు రవాణాకు సంబంధించి జీఎంలకు సూచనలు చేశారు. అండర్ గ్రౌండ్, ఓసీపీల నుంచి సీహెచ్‌పీలకు త్వరతగతిన బొగ్గు రవాణాకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. అలాగే సీహెచ్‌పీల నుంచి రేక్‌ల ద్వారా బొగ్గు రవాణాపై చర్చించారు. బొగ్గు డిస్పాచ్‌పై ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్, వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, క్వాలిటీ డీజీఎం శ్రీధర్, ప్రాజెక్టు ఇంజినీర్ ఎన్‌వీ రావు, ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం జీడీకే–5 ఓసీపీని సందర్శించారు. క్వారీలోకి వెళ్లి, ఉత్పత్తి తీరును పరిశీలించారు. ఓసీపీ సీహెచ్‌పీ వద్దకు వెళ్లి, బొగ్గు లోడింగ్, రవాణా వివరాలు తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ గ్యాలరీల వద్ద బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, సర్వే, మైనింగ్ అధికారులు సమష్టిగా ముందుకెళ్లాలని సూచించారు. గనిలో ప్రమాదాలు లేకుండా బొగ్గు ఉత్పత్తిపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలన్నారు. సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, కాలరీ మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

సింగరేణిలో ఉద్యోగం రావడం వరం



కారుణ్య నియామక పత్రాలు అందిస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని ఆర్జీ–3 డివిజన్ ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో ముగ్గురు కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ కావడంతో వారి కుటుంబసభ్యులకు గురువారం తన కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ఉద్యోగాన్ని వదులుకోవద్దని, విధులకు గైర్హాజరవకుండా విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, డీవైపీఎంలు రవీందర్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ సెటిల్‌మెంట్'ను వినియోగించుకోండి



ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు పెన్షన్ సెటిల్‌మెంట్ విధానాన్ని వినియోగించుకోవాలని ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ రామగుండం ఆదేశాల మేరకు ఉద్యోగ విరమణ పొందిన డిపెండెంట్(భార్య లేక భర్త) పెన్షన్ విధానాన్ని సులభతరం చేసేందుకు పలు ధ్రువపత్రాలను కార్మికులు విధులు నిర్వహించిన గనులు, ఇతర విభాగాల కార్యాలయాల్లో అందించాలని సూచించారు. భార్య, భర్త ఆధార్‌కార్డులు, పెన్షన్‌దారుని పెన్షన్ ఖాతా బుక్, ఇద్దరి మూడు జాయింట్ ఫొటోలు అందజేయాలన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలంలోని సుందిళ్లలో సంస్థ ఆర్జీ–1 ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ వైద్య సిబ్బందితో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వానాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు దాసరి లక్ష్మి, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజలింగు, డాక్టర్ రామలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏఐటీయూసీ ఆహ్వాన కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఏఐటీయూసీ ఆహ్వాన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్, బ్రాంచి కార్యదర్శి రాజరత్న మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కేంద్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందే ఆర్జీ–2 ఏరియాలో ఈ నెల 16న సభలు నిర్వహించేందుకు గాను అన్ని సెక్షన్ల కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా రాజరత్న, కార్యదర్శిగా అన్నారావుతోపాటు 8 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నాయకులు శంకర్, సంపత్, సాంబశివరావు, రవికుమార్ తదితరులున్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సీఎంకు పోస్టుకార్డులు పంపిస్తున్న జర్నలిస్టులు

కాల్వశ్రీరాంపూర్: జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని టీయూడబ్ల్యూ(ఐజేయూ) నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం మండల శాఖ ఆధ్వర్యంలో సీఎంకు పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు సొన్నాయిటెంకం చంద్రమౌళి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన భూమిక కీలకమైందని, అనేకసార్లు ఈ విషయమై సీఎం కేసీఆర్ ప్రశంసించారని తెలిపారు. ఉద్యమ నేతగా, ముఖ్యమంత్రిగా ఆయన జర్నలిస్టులకు అనేక హామీలు ఇచ్చారని, ఇప్పటివరకు నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. అర్హులకు ఇంటి స్థలం, ఇల్లు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేసి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టు బంధు పథకం అమలు చేయాలని కోరారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ సాధనకు ఉద్యమ బాట పట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భారత యాదవ సమితి నాయకులు

జ్యోతినగర్: రిజర్వేషన్ల సాధన కోసం యాదవులు ఐక్యంగా ఉద్యమ బాట పట్టాలని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేశ్‌యాదవ్, డాక్టర్ మధు యాదవ్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండంలోని దేవీ గార్డెన్స్‌లో యాదవుల ఆత్మ గౌరవం అభివృద్ధి, అధికారం, రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రూ.10వేల కోట్లతో యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక యాదవ హాస్టల్ నిర్మాణం, గొర్ల కాపరులకు 559, 1016 జీవోలను అమలు, ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలని తెలిపారు. 1970 వరకు అమలులో ఉన్న ఎస్ఎంటీ (సెమీ నోమాడిక్ ట్రైబ్) రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం గోదావరిఖని యాదవ సంఘం భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు చెలకల గిరిధర్ యాదవ్, యాదవ సంఘం రామగుండం నగర అధ్యక్షుడు పాతిపెల్లి రవియాదవ్, నాయకులు మెండె లింగన్న యాదవ్, పాతిపెల్లి మల్లయ్య యాదవ్, బత్తుల రవి యాదవ్, మేకల మహేష్‌యాదవ్, బావు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.